# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **దేశవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల వంటి వేసవి పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధతపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమీక్ష సమావేశం నిర్వహించారు.**

**2.** **ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, అక్రమ రవాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు.**

**3.** **సార్వత్రిక ఎన్నికల మూడో దశ నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఈ రోజు నుంచి ప్రారంభమవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయి.**

**5.** **కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం ఈ రోజు హైదరాబాద్‌లో జరగనుంది.**

============================

దేశవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల వంటి వేసవి పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధతపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే రెండు నెలల్లో మే నుండి జూన్ వరకు వేసవి ఉష్ణోగ్రతలకు సంబంధించిన సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ఈ పరిస్థితులకు తగినట్లుగా చర్యలు చెప్పట్టాలని అధికారులకు సూచించారు. అవసరమైన మందులు, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉండాలని తెలిపారు. రేడియో, టెలివిజన్ వంటి మాధ్యమాల ద్వారా స్థానిక భాషలలో వాతావరణ పరిస్థితులపై అవగాహన కల్పించడంతోపాటు ఆసుపత్రుల్లో తగిన సన్నాహాలను చేయాలని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.

--------------------------

ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, అక్రమ రవాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. నిన్న నెల్లూరు నగర పాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్, ఎన్నికల తనిఖీ బృందాలతో ముఖేష్ కుమార్ మీనా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని

పక్కాగా అమలు చేయాలని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. మద్యం విక్రయాలు, గోడౌన్లలో మద్యం నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల మూడో దశ నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఈ రోజు నుంచి ప్రారంభమవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. మూడవ దశలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 94 నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, జమ్మూకాశ్మీర్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో సహా దాద్రా, నగర్ హవేలీ, డామన్ మరియు డయ్యూ కేంద్ర పాలిత ప్రాంతాలలో మూడవ దశలో ఎన్నికలు జరుగనున్నాయి. మూడవ దశ లోక్‌సభ ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి తేదీ ఏప్రిల్ 19 కాగా.. నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 20న ఉంటుందని, మే 7న ఓటింగ్ జరుగుతుందని ఎన్నికల సంఘం తెలిపింది.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర పల్నాడు జిల్లాలో కొనసాగుతోంది. ఈ యాత్రలో భాగంగా అయన ఈ ఉదయం ధూళిపాళ్ల నుంచి బయలుదేరుతారు. సత్తెనపల్లి, కోర్రపాడు, మేడికొండూరు, పేరేచెర్ల జంక్షన్, నల్లపాడు మీదుగా హౌసింగ్ బోర్డు వద్దకు చేరుకుంటారు. అనంతరం చుట్టుగుంట సర్కిల్, వీఐపీ రహదారి మీదుగా సాయంత్రం ఏటుకూరు బైపాస్ సభ ప్రాంగణంకు చేరుకుని బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం తక్కెలపాడు బైపాస్, పెదకాకాని బైపాస్, వెంగళ్ రావు నగర్, నంబూరు క్రాస్ మీదుగా నంబూరు బైపాస్ దగ్గర రాత్రి బస చేస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు.

---------------------------

బీసీల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించామని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం నియోజవర్గం అంబాజీపేటలో నిర్వహించిన ప్రజాగళం సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో కలిసి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 50 ఏళ్లకే బీసీలకు పింఛన్ అందిస్తామని చెప్పారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కోసం పోరాడతామన్నారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కోనసీమ ప్రాంత రైల్వే ప్రాజెక్ట్ ను పూర్తిచేస్తామని తెలిపారు. కూటమి అధికారంలోకి తీసుకొస్తే రైతులకు అండగా నిలుస్తామన్నారు.

---------------------------

తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఏ.రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం తెలంగాణలో ప్రకటించని హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ 3 లోక్ సభ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై రేవంత్ రెడ్డి చర్చించినట్లు తెలిపాయి. కాగా తెలంగాణలో మొత్తం 17 స్థానాలకు గానూ కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు 14 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు ఈ రోజు విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు తాడేపల్లిలో ఇంటర్ బోర్డు కార్యదర్శి ఈ ఫలితాలను విడుదల చేయనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను ఒకేసారి విడుదల చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇప్పటికే జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తి చేసిన అధికారులు ఫలితాల విడుదలకు ఏర్పాట్లు పూర్తి చేశారని అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ పరీక్ష ఫలితాలను resultsbie.ap.gov.in వెబ్ సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.మార్చి ఒకటి నుంచి 20 వ తేదీ వరకు పరీక్షలు జరుగగా.. మొత్తం 10 లక్షల 53 వేల 435 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అందులో మొదటి ఏడాది పరీక్షలకు 5 లక్షల 17 వేల 570 మంది , రెండో ఏడాది పరీక్షలకు 5 లక్షల 35 వేల 865 మంది విద్యార్థులు హాజరయ్యారు.

---------------------------

తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు కట్టుబడి ఉందని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు పోరాడిన మహాత్మా జ్యోతిరావు ఫులే ఆశయ సాధనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిన్న జరిగిన ఫులే జయంతి ఉత్సవాల కార్యక్రమంలో అయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కుల సంఘాల సమస్యలను ఎలా పరిష్కరించాలో ఆయా సంఘాల ప్రతినిధులు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

---------------------------

అంతర్జాతీయ వ్యోమగాముల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. సోవియట్ యూనియన్‌కు చెందిన యూరీగగారిన్ 1961 ఏప్రిల్ 12వ తేదీన అంతరిక్షంలో ప్రయాణించిన మొదటి మానవునిగా ఘనత సాధించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఏప్రిల్ 12వ తేదీన వ్యోమగామి దినోత్సవాన్ని జరుపుకుంటూ.. వ్యోమగాములు, అంతరిక్ష శాస్త్రవేత్తలు ప్రపంచానికి అందిస్తున్న సేవలను స్మరించుకుంటున్నారు.

ఇదే సందర్భంలో అంతరిక్ష రంగంలో ప్రపంచదేశాలకు ధీటుగా భారత్ కూడా ఎన్నో విజయాలను సాధిస్తుండడం ఎంతైనా గర్వకారణం. భారత అంతరిక్ష విజయాల పట్ల అమెరికా, రష్యా, చైనా వంటి అగ్రదేశాలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

---------------------------

దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్ ర్యాంకులు ఈ నెల 25 వ తేదీ విడుదల కానున్నట్టు. జాతీయ పరీక్షల సంస్థ – ఎన్. టీ. ఏ. వెల్లడించింది. ఈ నేపథ్యంలో జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తుల ప్రక్రియ తేదీల్లో ఐఐటీ మద్రాస్ మార్పు చేసింది. జేఈఈ మెయిన్ ర్యాంకులను ఏప్రిల్ 20న వెల్లడిస్తామని గతంలో ఎన్‌టీఏ సమాచారమిచ్చింది. దీంతో ఫలితాలు విడుదలైన మరుసటి రోజు ఏప్రిల్ 21 నుంచి 30 వరకు అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభిస్తామని ఐఐటీ మద్రాస్ పేర్కొంది. తాజాగా ఎన్‌టీఏ ఈ నెల 25న జేఈఈ మెయిన్ ర్యాంకులు వెల్లడిస్తామని ప్రకటించిన కారణంగా ఈ నెల 21కి బదులు.. 27 నుంచి మే 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తులు స్వీకరించేలా ఐఐటీ మద్రాస్ షెడ్యూల్‌లో మార్పు చేసింది. పరీక్ష మాత్రం యథాతథంగా మే 26న జరుగుతుందని ప్రకటించింది.

---------------------------

కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం ఈ రోజు హైదరాబాద్‌లో జరగనుంది. బోర్డు మెంబర్ సెక్రటరీ

రాయిపురే, సభ్యులు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఈఎన్సీ నారాయణరెడ్డి సమావేశంలో పాల్గొని వేసవి తాగునీటి అవసరాలకు కృష్ణా జలాల పంపిణీ, లభ్యతపై చర్చించనున్నారు. శ్రీశైలం, సాగర్‌లలో తాగునీటి అవసరాలకుగాను ఆంధ్రప్రదేశ్ కు 45 టీఎంసీలు, తెలంగాణకు 35 టీఎంసీలను బోర్డు కేటాయించగా.. వాటి వినియోగం, మిగులుపై కీలక చర్చ జరగనుంది.

---------------------------

తెలంగాణాలో గృహాలకు ఉచిత విద్యుత్తు ఇచ్చే 'గృహజ్యోతి' పథకానికి కొత్త లబ్ధిదారుల నమోదు ప్రక్రియను ఎన్నికల కోడ్ కారణంగా తాత్కాలికంగా నిలిపివేశారు. కోడ్ ముగిసిన వెంటనే మళ్లీ కొత్త దరఖాస్తులను ఆమోదిస్తామని 'విద్యుత్ పంపిణీ సంస్థ'లు స్పష్టం చేశాయి. 'గృహజ్యోతి' పథకం కింద గత నెలలో మొదటిసారి 36 లక్షల ఇళ్లకు జీరో కరెంటు బిల్లులు జారీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షలకు పైగా రేషన్ కార్డులున్నందున మిగిలిన వారు తమపేరు కూడా నమోదు చేయాలని దరఖాస్తులిస్తున్నప్పటికీ .. ఎన్నికల కోడ్ కారణంగా నమోదు ప్రక్రియను నిలిపివేశారు. గత నెలలో జీరో బిల్లు జారీ అయిన 36 లక్షల మందికి ఈ నెలలోనూ యథావిధిగా పథకాన్ని వర్తింపజేస్తున్నారు.

======================